క్లుప్తంగా

పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలి

పెద్దకడబూరు: 9వారాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి బిల్లులను తక్షణమే చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సచివాలయం – 1 ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో వ్యవసాయ పనులు అయిపోయిన తరువాత పేద ప్రజలకు ఉపాధి హామీ పనులు తప్పా ఇతర ఏ పనులు లేవన్నారు. మండలంలో చాలామంది ఇప్పటికే సూదూర ప్రాంతాలకు వలస వెళ్లడం జరిగిందన్నారు. మిగిలిన కొంతమంది ఉపాధి పనులకు వెళ్లితే వారికి ప్రభుత్వం 9వారాలుగా బిల్లులు చెల్లించకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వినతిపత్రాన్ని సచివాలయ సిబ్బందికి సమర్పించారు. కార్యక్రమంలో సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఈరన్న, దస్తగిరి, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు



స్కానింగ్ పరీక్షల పేర్ల నమోదు చేసుకుంటున్న వైద్య సిబ్బంది

ఎమ్మిగనూరురూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో సోమవారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 440 మంది గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు చేసినట్లు ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టరు బాలజీ తెలిపారు. ఎమ్మిగనూరు,మంత్రాలయం, నందవరం, పెద్దకడబూరు, కోసిగి మండలాల నుంచి స్కానింగ్ పరీక్షలకు గర్భిణులు ఉదయమే ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. స్కానింగ్ పరీక్షల్లో గైనకాలజిస్ట్ డాక్టర్లు సుజిత, ఫాతిమా ఉన్నారు. స్కానింగ్ పరీక్షల కోసం వచ్చిన గర్భిణులకు మార్నింగ్ ఫన్నీ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరురూరల్: ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగుల పట్ల వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ సరైన వైద్యం అందించటం లేదని, అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త, న్యాయవాది తిమ్మప్ప కోరారు. సోమవారం తహసీల్దార్ శేషఫణికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆదివారం ప్రసవం కోసం వచ్చిన సువార్తమ్మ అనే మహిళకు నార్మల్ డెలివరీ చేయడంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా మగ శిశువు మరణించినట్లు చెప్పారు. ప్రసవ సమయంలో వైద్యులు లేకపోయినా స్టాఫ్ నర్సులు ప్రసవం చేయటం వలన బేబీ చనిపోయిందని ఆరోపించారు. ప్రజా సంఘాల నాయకులు ఓంకార్, రాజీవ్, రాజు తదితరులు ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందిస్తున్నాం

ఆదోని సెంట్రల్: పట్టణంలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నామని వసతి గృహ వార్డన్ సి.సిద్ధప్ప సోమవారం విలేకరులకు తెలిపారు. ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షులు లింగప్ప చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. పర్మిషన్ లేకుండా వసతి గృహంలోకి వచ్చి విద్యార్థుల చేత పనులు చేయిస్తున్నట్లు, నాణ్యత కొరవడిన భోజనం వడ్డిస్తున్నట్లు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. పర్మిషన్ లేకుండా వసతి గృహంలోకి రావడమే కాకుండా ఇలాంటి ఆరోపణలను చేయడంపై టూటౌన్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు.

స్వర్ణామృత ప్రాసనం పంపిణీ

ఆదోని అర్బన్: ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో వికాస తరంగిణీ వారి సహకారంతో దాత, ఎన్ఆర్ఐ కాకుబా శ్ నగేష్ సౌజన్యంతో చిన్నారులకు స్వర్ణామృత ప్రాస నం మందు సోమవారం పంపిణీ చేశారు. స్థానిక అభ య అంజనేయస్వామి ఆలయ ప్రాంగణ ంలో 213 మ ంది చిన్నారులకు మందును వేసినట్లు అవోపా పట్టణాధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్‌గుప్తా తెలిపారు. ఈ మందు ద్వారా చిన్నారులకు రోగ నిరోధకశక్తి పెంచడానికి, మేధాశక్తి, మానసిక ఎదుగుదలను పెంచడానికి దోహ దపడుతుందన్నారు. కార్యక్రమంలో అవోపా పట్టణ కోశాధికారి వెంకటేశ్వర్లు, సభ్యులు రత్నయ్య, అవోపా మహిళా విభాగం అధ్యక్ష కార్యదర్శులు వంకదారు మమతాశ్రీ, ఇల్లూరు అనిత పాల్గొన్నారు.

పెన్నులు, ప్యాడ్లు పంపిణీ



పెన్నులు, ప్యాడ్లు పంపిణీ చేసిన దృశ్యం

నందవరం : పదవ తరగతి విద్యార్థినులు ధైర్యంగా పబ్లిక్ పరీక్షలు రాయాలని మండల విద్యాధికారి-2 రఘునాథ్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలో హోల్కర్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు రాణి అహల్య బాయి ఆధ్వర్యంలో ఎంఈఓ, ప్రిన్సిపాల్ శైలజ చేతుల మీదుగా విద్యార్థినులకు పెన్నులు, ప్యాడ్లు పంపిణీ చేశారు. హోల్కర్ సేవా సంస్థ సభ్యులు వీరేష్, శ్రీహరి, గజేంద్ర, కనకవీడు రవి, సూరి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై అడ్డంకులు.. ట్రాఫిక్‌కు ఇబ్బందులు

- ఇరుకు రోడ్లతో రాకపోకలకు అంతరాయం
- రోడ్లపైనే వ్యాపారాలు, ఆటోల పార్కింగ్
- వాహనదారులకు తప్పని అవస్థలు



గోనెగండ్లలోని ఎమ్మిగనూరు- కర్నూలు రోడ్డులో ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనాలు

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్ల, హెచ్. కైరవాడి గ్రామాల్లో ట్రాఫిక్ సమస్య జఠిలంగా ఉంది. వాహన రాకపోకలు రోజురోజుకీ పెరుగుతున్నా అధికారులు అందుకు తగ్గట్లు చర్యలు తీసుకోవడం లేదు. ఇరుకు రోడ్లతో పాటు ఎక్కడబడితే అక్కడ వాహనాలను పార్కింగ్ చేయడ ం, రోడ్లపైనే వ్యాపారాలు నిర్వహిస్తుండటంతో నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది.

30 గ్రామాలకు కేంద్రం

కర్నూలు, మంత్రాలయం, ఆదోని ప్రాంతాల వైపు నుంచి వచ్చే వాహనాల రాకపోకలు అధికంగా ఉండడంతో గోనెగండ్ల, హెచ్. కైరవాడి గ్రామాల్లో నిత్యం సమస్యలు తప్పడం లేదు. ఆయా ప్రాంతాలకు వెళ్లాలంటే మండలంలోని సుమారు 30 గ్రామాలకు చెందిన ప్రజలకు ఇక్కడికి రాకతప్పదు. ఇక్కడ బస్టాండ్లు ఉన్నా లేనట్లే అన్నట్లుగా.. ఎలాంటి సాదుపాయాలు లేకపోవడంతో ఎమ్మిగనూరు, ఆదోని, మంత్రాలయం, కోడుమూరు, కర్నూలు వెళ్లే ప్రజలు గోనెగండ్ల, హెచ్. కైరవాడిలోని రోడ్లపై నిలబడాల్సి వస్తోంది.

నిత్యం వాహనాల రద్దీ

ఆర్టీసీ బస్సులతో పాటు ఇసుక, తదితర సామగ్రిను తరలించే లారీలు, ట్రాక్టర్లు, ప్రైవేట్ వాహనాలు నిత్యం సంచరిస్తుంటాయి. వీటికి తోడు వందల సంఖ్యలో షేర్ ఆటోలు ఇబ్బడిముబ్బడిగా తిరుగుతున్నాయి. ఎక్కువ సంఖ్యలో వాహనాలు తిరుగుతుండడంతో ట్రాఫిక్ సమస్య అధికమవుతోంది. ఎమ్మిగనూరు, కోడుమూరు, తదితర గ్రామాలకు వెళ్లే ఆటోలను రోడ్లపైనే పార్కింగ్ చేస్తుండడం మరింత ఇబ్బందికరంగా మారింది. దుకాణాల వద్ద వాహనాలను ఉంచడంతో వ్యాపారాలకు అంతరాయం కలుగుతోంది. చిరు వ్యాపారులు సైతం రోడ్లపైనే విక్రయాలు చేస్తుండడంతో ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది.

రోడ్డు ఆక్రమించి అద్దెకు..

మండలంలో అనేక చోట్ల రోడ్లపైనే వ్యాపారులు చేస్తున్నారు. ఎమ్మిగనూరు, కర్నూలు తదితర ప్రాంతాలకు వెళ్లే రహదారిలో ఉన్న షాపుల యాజమానులు తమ షాపులతో పాటు ముందు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు స్థలాన్ని ఆక్రమించి చిరు వ్యాపారులకు అద్దెలకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. గోనెగండ్లలో ఎస్‌బీఐ బ్యాంక్ నుంచి విద్యుత్ సబ్ స్టేషన్ వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు స్థలంలో చిరు వ్యాపారులకు అద్దెలు ఇవ్వడంతో రోడ్డు ఇరుకుగా మరింది. దీంతో వాహనాలు వెళ్లేందుకు ఇక్కట్లు తప్పడం లేదు. ఏ సమయంలో ఏ వాహనం వెనక నుంచి వచ్చి ఢీకొడుతుందో తెలియక ఆందోళన చెందుతున్నారు. గోనెగండ్లలో చాంద్ టాకీస్, ఆస్పత్రి రోడ్డు, గంజిహళ్లి కూడలిలో ఏ మూల నుంచి ఏ వాహనం దూసుకుపోతుందో తెలియక స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఈ కూడలిలో రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయిన సంఘటనలు కూడా చాలానే ఉన్నాయి. పెద్ద వాహనాలు వస్తే ట్రాఫిక్ సమస్య ఏర్పడి వాహనాలు నిలిచిపోతున్నాయి. కొన్ని సందర్భాల్లో అయితే అంబులెన్స్ వాహనాలకు కూడా దారి లభించని పరిస్థితి. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని, ఆర్‌అండ్‌బీ రోడ్డు స్థలంలో అక్రమణలని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్లపై వ్యాపారాలతో ఇబ్బంది



వ్యాపారాలు చేసుకునే వారు ఆర్‌అండ్‌బీ స్థలాన్ని వదిలి వ్యాపారాలు చేసుకోవాలి. రోడ్డు స్థలంలో వ్యాపారాలు చేస్తుండడంతో రోడ్డు మీద వెళ్లే వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవు తున్నాయి. రోడ్డుపై ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. అధికారులు ఈ విషయంపై దృష్టి సారించి రోడ్డు స్థలంలో ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలి.

–కరుణాకర్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు, గోనెగండ్ల

అధికారులు చొరవ చూపాలి



అధికారులు చొరవ తీసుకుని గోనెగండ్లలో ట్రాఫిక్ సమస్య లేకుండా చూడా లి.ఎమ్మిగనురు, కర్నూలు వెళ్లే దారిలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా అధికారులు చొరవ తీసుకోవాలి. పట్టించుకోకపోతే రోజు రోజుకు ట్రాఫిక్ సమస్య పెరుగు తుంది. వ్యాపారులు రోడ్డు స్థలంలో కాకుండా దూరంగా వ్యాపారులు చేసుకోవాలి. అలాగే వివిధ గ్రామాలు, పట్టణాలు వెళ్లే ఆటోలు ఆటో ల స్టాండ్ దగ్గర పార్కింగ్ చేసుకుంటే ట్రాఫిక్ సమస్య ఉండదు

.–మునిస్వామి, ఏఐఎస్ఎఫ్ తాలూకా అధ్యక్షుడు, గోనెగండ్ల

యువత పోరుకు సిద్ధం కండి

మంత్రాలయం : విద్యార్థులను, యువతను మోసగిస్తున్న కూటమి సర్కార్‌పై నిరసన తెలుపుతూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 12న కర్నూలులో చేపట్టబోయే యువత పోరుకు సిద్ధం కావాలని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మంత్రాలయంలో వైఎస్సార్ సీపీ మండల నాయకులతో కలిసి యువత పోరు పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు విద్యార్థులను, యువతను మాయమాటలతో మభ్య పెట్టి ఓట్లు దండుకుని , అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. ఈనెల 12న కర్నూలులో గౌరిగోపాల్ సర్కిల్ నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి, కలెక్టర్‌కు వినతిని అందజేస్తున్నట్లు తెలిపారు. యువత, నిరుద్యోగులు, వైఎస్సార్ సీపీ నాయకులు తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భీమా రెడ్డి, జిల్లా కార్యదర్శి విశ్వనాథ్ రెడ్డి, వైఎస్సార్ సీపీ యూత్ విభాగం అధ్యక్షుడు నరవ రాజశేఖర్ రెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు దయ్యాల మహబూబ్, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్ రెడ్డి

ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తోంది

గోనెగండ్ల : కూటమి ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తుందని వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి బందెనవాజ్ అన్నారు. సోమవారం మండల కేంద్రం గోనెగండ్లలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి యువత పోరు పోస్టర్లను విడుదల చేశారు. ఈనెల 12న జిల్లా కలెక్టరెట్ వద్ద నిర్వహించే యువత పోరు కార్యక్రమానికి పార్టీ నాయకులు, విద్యార్థులు, యువత, నిరుద్యోగులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గోవింద్, మబువలి, షరీఫ్, ఇమ్రాన్, ముల్లాహుసేన్ వలి, బడేసావలి, రంగన్న నాయుడు పాల్గొన్నారు.

ప్రతి అర్జీని పరిష్కరించాలి

ఆదోని రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదికే పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం–పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం–పీజీఆర్ఎస్‌లో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయాశాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువు లోపు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్స్ శ్రీనివాసరాజు, వేణుసూర్య, డీఎల్‌పీఓ నూర్జహాన్, ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ డీఎం హెచ్ఓ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యలు వింటున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఇస్కాన్‌కు బ్యాటరీ వాహనం విరాళం

ఆదోని అర్బన్: పట్టణంలోని ఎమ్మిగనూరు రోడ్డులో ఉన్న గార్డెనియా విల్లాస్‌లోని ఇస్కాన్ సేవా సంస్థకు సోమవారం ఎన్ఆర్ఐ దాతలు ఖరీదైన బ్యాటరీ వాహనంను విరాళంగా అందజేశారు. ఆదోనివాసి రవి అలియాస్ రాఘసింధుదాస్, ఆయన ధర్మపత్ని సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ న్యూయార్క్ నగరంలో స్థిరపడ్డారు. ఆయన గత 15 సంవత్సరాలనుంచి న్యూయార్క్ నగరంలోని ఇస్కాన్ టెంపుల్‌లో సేవలు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం న్యూయార్క్ నగరంలో స్థిరపడిన వారి తండ్రి, కుటుంబ సభ్యులు శంకర్, జగదీష్‌లు ఇస్కాన్ ఆదోని ప్రతినిధి శ్రీ రూపానందదాస్ ప్రభుకు వాహన తాళాలను అందజేశారు. కార్యక్రమంలో ఇస్కాన్ భక్తులు సుదర్శన్‌రెడ్డి, సునీత, గట్టు నాగరాజు, శివ తదితరులు పాల్గొన్నారు.



ఇస్కాన్ వారికి బ్యాటరీ వాహనం తాళాలను అందజేస్తున్న ఎన్ఆర్ఐ దాతలు

రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాకు అన్యాయం

ఎమ్మిగనూరుటౌన్/ఆదోని రూరల్/నందవరం/పెద్దకడబూరు : రాష్ట్ర బడ్జెట్‌లో కూటమి ప్రభుత్వం జిల్లాకు తగిన నిధులు కేటాయించక తీవ్ర అన్యాయం చేసిందని సీపీఐ నాయకులు విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఆదోని, ఎమ్మిగనూరు, పెద్దకడబూరు, నందవరంలో ఆ పార్టీ నాయకులు నిరసన ర్యాలీలు చేపట్టారు. వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తాము అధికారంలోకి వస్తే సాగునీటి ప్రాజెక్టులు వేదావతి, ఆర్డీఎస్ కుడికాలువ, గుండ్రేవుల రిజర్వాయర్ ప్రాజెక్టు, గురురాఘవేంద్ర ప్రాజెక్టుకు నిధులు కేటాయించి ప్రాజెక్టులను పూర్తి చేసి, కరువు వలసలను నివారిస్తానని హామీ ఇచ్చారన్నారు. అయితే సాగునీటి ప్రాజెక్టులకు ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వకుండా, నిధులు కేటాయించకుండా ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించారని మండిపడ్డారు. కార్యక్రమాల్లో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన్నగౌడ్, కె.అజయ్‌బాబు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సోమేశ్వరరెడ్డి, సీపీఐ ఆదోని పట్టణ కార్యదర్శి సుదర్శన్, పెద్దకడబూరు మండల కార్యదర్శి వీరేష్, ఏఐవైఎఫ్ డివిజన్ కార్యదర్శి జాఫర్‌పటేల్, నాయకులు తిమ్మగురుడు, కె.సి.జబ్బార్, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోసిగి: మండలంలోని పంట పొలాలకు అందించే 3ఫేస్ విద్యుత్ సరఫరాలో నేటి నుంచి 10 రోజులపాటు అంతరాయం ఉంటుందని కోసిగి మండల ట్రాన్స్ కో ఏఈ వీరేష్ సోమవారం తెలిపారు. కర్నూలు నుంచి గూడూరుకు వచ్చే 132 కె.వి లైన్ కండక్టర్ మార్చుతున్న కారణంగా జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు రైతులకు 3 ఫేస్‌లో స్వల్ప అంతరాయం ఉంటుందని తెలిపారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

దివ్యాంగుల సమస్యలపై దృష్టి సారించాలి

ఎమ్మిగనూరుటౌన్: నియోజకవర్గంలోని దివ్యాంగుల సమస్యలపై దృష్టి సారించి, వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని, ఇందుకు తాము పూర్తి సహాయ సహకారాలందిస్తామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక పార్టీ దివ్యాంగుల సంఘ నాయకులకు సూచించారు. వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎన్నికైన పరమాన్‌దొడ్డి గ్రామానికి చెందిన గొల్ల లక్ష్మీనారాయణ యాదవ్ సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆమెతో పాటు బుట్టా ఫౌండేషన్ అధినేత బుట్టా శివనీలకంఠ, పార్టీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞలు తెలిపారు. దివ్యాంగుల సంఘ నాయకులు న్యాయవాది ఇర్షాద్, రంగన్న, నాగప్ప, వడ్డేకుమార్, యాకోబు, వెంకటేష్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.



బుట్టా రేణుకకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దివ్యాంగుల విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు

పని ఒత్తిడి నుంచి ఉపశమనం కల్పించండి

గోనెగండ్ల : పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న అధిక పని భారం, పని ఒత్తిడి నుంచి ఉపశమనం కల్పించాలని పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, వెంకటేష్, సోమేష్ కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ మణి మంజరికు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు వివిధ రకాల సర్వేలతో పాటు దినసరి ప్రాథమిక విధులు ఇంటి, కుళాయి, లైసెన్స్ పన్నులు వసూలు, లీజ్ వసూళ్లు, వేలం పాటలు, పీఆర్‌వన్ యాప్, పారిశుద్ధ్య నిర్వహణ, సురక్షిత తాగునీరు సరఫరా నిర్వహణ ఇలా 21 రకాల పనులు చేస్తున్నామని చెప్పారు. దీంతో పని భారం పెరిగిందన్నారు. కార్యక్రమాలు పంచాయతీ కార్యదర్శులు సుభాన్, ప్రభాకర్, తిరుమలేష్, మద్దిలేటి, శ్రీధర్, రామదాస్ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే వర్ధంతి

ఆదోని టౌన్/ఆదోని సెంట్రల్: ఆదోని డివిజన్ బీసీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే 128వ వర్ధంతిని సోమవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదోని డివిజన్ బీసీ ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్ కత్తి హనుమంతరావు, గౌరవ సలహాదారులు దేవిశెట్టి ప్రకాష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరినాయుడు, పట్టణ జాయింట్ సెక్రటరీ బెస్త ప్ర కాష్ తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల : మండల కేంద్రంలోని ఆర్‌టీసీ బస్టాండ్‌లో కేవీపీఎస్ ఆధ్వర్యంలో సోమవారం సావిత్రిబాయి పూలే 128వ వర్ధంతిని నిర్వహించారు. కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్, నాయకులు మునిస్వామి, మారేష్, ఆటో యూనియన్ నాయకులు వీరన్న గౌడ్, వీరేష్, శ్రీను, వలి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తుల అరెస్ట్

ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరివాణం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు గంజాయిని తరలిస్తుండగా సోమవారం అరెస్టు చేసినట్లు ఇస్పీ ఎస్ఐ నాగేంద్ర విలేకరులకు తెలిపారు. గ్రామానికి చెందిన కోటేకల్ అయ్యన్న, కోటేకల్ మల్లికార్జున అనే వ్యక్తులు సిరుగుప్పకు చెందిన గుర్తు తెలియని వ్యక్తికి విక్రయించేందుకు వెళ్తుండగా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 0.854 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

కొలువుదీరిన మన్మథ సమేత పార్వతీ పరమేశ్వరులు



ఆదోని అర్బన్: హోలీ పండగను పురస్కరించుకుని స్థానిక కిలిచినపేటలోని అంబాభవానీ దేవాలయంలో సోమవారం అర్ధరాత్రి మన్మథ సమేత పార్వతీ పరమేశ్వరులు కొలువుదీరారు. ఆదివారం రాత్రి రంగురంగుల బిందెలతో పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేపట్టారు.

నిరుద్యోగులకు అండగా యువతపోరు

ఆదోని టౌన్: విద్యార్థులు, నిరుద్యోగులకు అండగా నిలుస్తూ ఈనెల 12వ తేదీన కర్నూలు జిల్లాలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో యువత పోరు ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఎస్‌కేడీ కాలనీలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద యువత పోరు పోస్టర్లను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫయాజ్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో విద్యార్థులు, నిరుద్యోగ యువతకు అండగా వైఎస్సార్‌సీపీ నిలుస్తోందన్నారు. ఈనెల 12వ తేదీన కర్నూలులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయం నుంచి యువత పోరు ర్యాలీ ప్రారంభమై కలెక్టరేట్‌కు చేరుకుంటుందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తామన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున తరలివచ్చి యువతపోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు బాలాజీ, రామలింగేశ్వరయా దవ్, యువజన సంఘం అధ్యక్షుడు నల్లారెడ్డి, సన్నీ, ప్రచార అధ్యక్ష కార్యదర్శులు నారాయణ, బాలు, నాయకులు రహమాన్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

వైభవంగా.. బసవేశ్వరుడి ప్రభోత్సవం



అశేష భక్తజనుల మధ్య స్వామి వారి ప్రభోత్సవం

కోసిగి: మండల పరిధిలోని జంపాపురం గ్రామ ప్రజల ఆరాధ్య దైవం బసవేశ్వర స్వామిప్రభోత్సవం సోమవారం సాయంత్రం వేలాది మంది భక్తుల మధ్య అత్యంత వైభవంగా సాగింది. వేకువ జామున నుంచి ఆలయ ప్రధాన అర్చకులు వీరభద్రయ్య స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, మహా మంగళ హారతు గావించి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు స్వామి వారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. సాయంత్రం సంప్రాధాయబద్ధంగా స్వామి వారి మూలవిరాట్‌ను పల్లకీలో కొలువుంచి కలసాలు, మేళతాళాలు, డప్పువాయిద్యాయులతో నందికోళ్లు ఆడించుకుంటూ ఊరేగింపుగా ఆలయం చెంతకు చేర్చారు. అనంతరం ప్రభపై ఉత్సవమూర్తిని కొలువుతీర్చి భక్తుల మధ్య రమణీయంగా స్వామి వారి పాదాల చెంత వరకు ఊరేగించి తిరిగి యథా స్థానానికి చేర్చారు. భక్తులు ప్రభపై అరటి పళ్లు విసిరి మొక్కులు చెల్లించారు. ప్రభోత్సవానికి వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు వై. ప్రదీప్ రెడ్డి, జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై స్వామి వారిని దర్శించుకుని పూజలు చేసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల నాయకులు నాడుగేని నరసింహులు, ఎంపీపీ ఈరన్న, పార్టీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ, బుళ్లి నరసింహులు, బసిరెడ్డి, గ్రామ సర్పంచ్ హారోన్ తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

గోనెగండ్ల : రజక వృత్తిదారులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి సి. గురుశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం గోనెగండ్లలో రజక వృత్తిదారుల సంఘం మండల జనరల్ బాడీ సమావేశం మండల నాయకుడు శివరాముడు అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా కార్యదర్శి గురుశేఖర్, గౌరవ అధ్యక్షుడు హనుమంతు, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్ మాట్లాడుతూ ఈనెల 22వ తేదీన కోడుమూరులో జరిగే రజక సంఘం ఆరవ జిల్లా మహాసభకు మండలంలో ఉండే రజక వృత్తిదారులు మేధావులు ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కులుమాల నరసింహులు, అధ్యక్షుడిగా డాక్టర్ శివరాముడు, ఉపాధ్యక్షులుగా వాసు, శేఖర్, రాజేష్ లను ఎన్నుకున్నారు.

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పోస్టులు భర్తీ చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: ఐసీడీఎస్ శాఖలో రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా 164 సూపర్‌వైజర్ పోస్టులను భర్తీ చేయాలని అంగన్‌వాడీ హెల్పర్స్, వర్కర్స్ యునియన్, ఏఐటీయుసీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు నాగశిరోమణి, వెంకటలక్ష్మి డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం ఆయా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ శేషఫణికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తిమ్మగురుడు, విజయేంద్ర, త్రివేణి, వరలక్ష్మి, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓను సస్పెండ్ చేయాలి

ఆదోని రూరల్: ప్రభుత్వ నియమ, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న మంత్రాలయం ఎంఈఓపై విచారణ జరిపి సస్పెండ్ చేయాలని పీఎస్‌యూ, ఆర్‌యూఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు వినతి పత్రం అందజేశారు. పీఎస్‌యూ జిల్లా కార్యదర్శి సురేష్, ఆర్‌యూఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రఘునాథ్ మాట్లాడుతూ మంత్రాలయం మండలంలో ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్న మెయినుద్దీన్ ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం, ఎస్‌జీటీలను పాఠశాలలకు పంపకుండా కార్యాలయంలో పనులకు వినియోగించుకుంటున్నాడన్నారు.

నిధులు రికవరీ చేయండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని కేజీబీవీలో అక్రమాలకు పాల్పడి విద్యార్థుల కడుపులు మాడ్చిన ప్రిన్సిపాల్‌ను మళ్లీ పోస్టింగ్ ఇవ్వడం శోచనీయమని, ఆమె నుంచి నిధులను రికవరీ చేయాలని పీడీఎస్ఓ, ఆర్‌పీవీఎఫ్, డీఎస్‌వైఏ సంఘాల నాయకులు కృష్ణ, సురేంద్రబాబు, వెంకటేష్ డిమాండ్ చేశారు. విద్యార్థుల సొమ్మును ఆమె పక్కదారి పట్టించినట్లు జిల్లా ఉన్నతాధికారులు నిర్ధారించినా చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారం

కౌతాళం: స్థానిక హనుమన్‌నగర్ జమ్మిచెట్టు వద్ద ఉన్న డ్రైనేజి సమస్యకు సోమవారం పరిష్కారం చూపారు. ఇక్కడ డ్రైనేజీ నీరు పూర్తిగా రోడ్డు పై వచ్చి ఇబ్బంది ఉండడంతో సర్పంచ్ పాల్‌దినకర్ స్పందించి రోడ్డుపై మురుగు నీరు ప్రవహించకుండా సిమెంటు కల్వర్టు పైప్‌లైన్ వేయించారు.